

4 లో

ఆపరేషన్ గరుడ ప్రారంభం


ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్

ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

గురువారం | 04 ఏప్రిల్, 2024 | పేజీలు : 04


# ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం

## కాగజ్‌నగర్ డీఎస్‌పి కరుణాకర్

**ప్రజాపక్షం/కాగజ్ నగర్ :** నేరాల నిర్మూలన కొరకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని, ప్రజలకు పోలీసులు ఎల్లవేళల అందుబాటులో ఉండి సేవలు అందిస్తారని ఆసిఫాబాద్ డీఎస్‌పి కరుణాకర్ అన్నారు. బుధవారం డిఎస్‌పి ఆధ్వర్యంలో కాగజ్ నగర్ టౌన్ సిఐ శంకరయ్య, ఎస్ఐలు అంజయ్య, మహేందర్, ఓబులమ్మ, పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి సర్దార్ బస్తి లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం కార్యక్రమం నిర్వహించి బస్తీలోని ఇళ్లలో సోదాలు చేశారు. వాహన పత్రాలు సరిగా లేని 53 మోటార్ సైకిళ్లకు, 13 ఆటోలకు జరిమాన విధించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి కరుణాకర్ మాట్లాడుతూ ప్రజల రక్షణ, ప్రజలకు భద్రత భావం కల్పించడం పోలీసుల ప్రథమ కర్తవ్యం అని అన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు ఇల్లు అద్దె కొరకు మీ దగ్గరకు వస్తే వారి పూర్తి వివరాలు అడిగి వారి వద్ద నుండి ఆధార్ కార్డ్ తీసుకో వాలని, ఏమైనా అనుమానం వస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనాలకు సంబంధించిన అని ధ్రువపత్రాలు ఉండాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఏదైనా ప్రమాదం జరిగిన సమయంలో ఇన్సూరెన్స్ వర్తించదని, ఇన్సూరెన్స్ గడువు ముగియక ముందే దానిని రినివల్ చేసుకోవాలని తెలిపారు. ప్రజలు, మహిళలు ఆపద సమయంలో స్థానిక పోలీసులకు, లేదా డయల్ 100కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని, సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్లయితే వెంటనే 1930 లేదా డయాల్ 100 కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఎవరిదైనా మొబైల్ పోయిన, దొంగిలించబడిన యెడల సిఇఐఆర్ పోర్టల్ నందు తమ వివరాలను నమోదు చేసుకున్నచో వారికి మొబైల్ దొరికే అవకాశం ఉంటుందని, ప్రజలు వివిధ ప్రాంతాలకు వెళ్ళినప్పుడు పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని, తమ తమ ఏరియాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. మహిళలకు సంబంధించి ఏదైనా సమస్యలు ఉన్నచో కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పరిధిలో గల



షీ టీం 8712527957 నెంబర్ కు ఫోన్ చేసినట్లయితే తక్షణ పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ శంకరయ్య, ఎస్ఐలు అంజయ్య, మహేందర్, ఓబులమ్మ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# భూ సేకరణ ప్రతిపాదనలు రూపొందించాలి

## అదనపు కలెక్టర్ జి.వి శ్యామ్ ప్రసాద్‌లాల్



**ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి :** వరంగల్ మంచిర్యాల మధ్య 4 లైన్ల గ్రీన్ ఫీల్డ్ కారిడార్ జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రతిపాదనలు శనివారం లోగా సంబంధిత నివేదికలు సమర్పించాలని అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో మంచిర్యాల వరంగల్ జాతీయ రహదారి భూ సేకరణ సర్వే ప్రతిపాదనల రూపకల్పనపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూవరంగల్‌మంచిర్యాల మధ్య 4 వరుసల గ్రీన్ కారిడార్ జాతీయ రహదారి కోసం పెద్దపల్లి జిల్లాలోని మంథని, రామగిరి, ముత్తారం మండలాల్లో అవసరమైన భూ సేకరణ చేపట్టుటకు సర్వే చేసి ప్రతిపాదనలను శనివారం నాటికి సిద్ధం చేయాలని,రోడ్లు, భవనాల శాఖ, అటవీ శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, మిషన్ భగీరథ ఇంట్రా, ఉద్యానవన శాఖ అధికారులతో జాతీయ రహదారి నిర్మించడం వల్ల ఆయా శాఖల పరిధిలో కలిగే నష్టాలకు, వాటి పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలు, అదే విధంగా సేకరించాల్సిన భూమి , రైతులకు చెల్లించాల్సిన నష్టపరిహారం, తదితర అంశాలపై సంపూర్ణ నివేదిక రూపొందించాలని, జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయే 455 మంది రైతులకు నష్ట పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం 36 కోట్లు మంజూరు చేసిందని, రామగిరి, ముత్తారం, మంథని తహసిల్దారులు సంబంధిత రైతుల ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు సేకరించి శనివారం నాటికి సమర్పించాలని, రైతులకు నష్టపరిహారం సొమ్ము వారి బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో మంథని రెవెన్యూ డివిజన్ అధికారి హనుమా నాయక్, జిల్లా అటవీ శాఖ అధికారి శివయ్య, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి, ఆర్.డబ్ల్యు.ఎస్.,ఆర్.అండ్ బి., సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వివిప్యాట్ ర్యాండమైజేషన్ పూర్తి

## జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మొదటి దశ ఈవిఎం,వివి ప్యాడ్ యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు.బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ తో కలసి ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవిఎం యంత్రాల మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు ఈవిఎం యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేపట్టామని తెలిపారు.జిల్లాలోని నిర్మల్,ఖానాపూర్, ముధోల్ నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాలకు ఆన్ లైన్ ద్వారా ఈవీఎం యంత్రాలను కేటాయించడం జరిగిందదన్నారు. నిర్మల్ నియోజకవర్గం పరిధిలో 382 కంట్రోల్ యూనిట్లు.382 బ్యాలెట్ యూనిట్లు,415 వివి ప్యాట్ లను,ఆలాగే ముధోల్ నియోజకవర్గంలో కంట్రోల్ యూనిట్,388,బ్యాలెట్ యూనిట్లు 388,419 వివి ప్యాట్‌లను ఆన్ లైన్ విధానం ద్వారా ర్యాండమైజేషన్ నిర్వహించి కేటాయించడం జరిగిందన్నారు.మెదటి దశ ర్యాండమైజేషన్ కు సంబంధించిన రిపోర్టు కాపీలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించడం జరుగుతుందని అన్నారు. రాజకీయ పార్టీలు,ప్రతినిధులు ఎన్నికల కమిషన్ నిబంధనలను తప్పనిసరి పాటించాలని అన్నారు. ప్రచారానికి,ర్యాలీలు,సభలు,సమావేశాలకు సువిధ యాప్ ద్వారా అనుమతులు పొందాలని తెలిపారు.నిబంధనలను పాటిస్తూ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్,ఈడిఎం నదీమ్,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.



## అనుమతి లేని హద్దురాళ్ల తొలగింపు

**ప్రజాపక్షం/నస్పూర్ :** నస్పూర్ మున్సిపల్ పరిధి శ్రీరాంపూర్ ప్రాంతం సంగమల్లయ్య పల్లె లోని వెంచర్లను డిటిఎఫ్ బృందం మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్, తహశీల్దార్ శ్రీనివాస్, గిరిధవార్ మాంతయ్యలతో కలిసి బుధవారం సందర్శించారు. అనుమతి లేకుండా వెంచర్లో ఏర్పాటు చేసిన హద్దు రాళ్లను జెసిబి సహాయంతో తొలగించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ అనుమతి లేకుండా ఎలాంటి నిర్మాణం చేపట్టరాదని పేర్కొన్నారు. ఎవరైనా ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేస్తే, తెలంగాణ మున్సిపల్ చట్టం 2019 ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

## శివాజీ మహారాజ్ వర్ధంతి వేడుకలు

**ప్రజాపక్షం /సిర్పూర్ టి :** చత్రపతి శివాజీ మహారాజ్ 344వ వర్ధంతి వేడుకలను ఆరె సంఘము మండలం అధ్యక్షులు చన్నపూర్ శంకర్ అధ్యర్యంలో బుధవారం రోజున సిర్పూర్ టి మండలం కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు నరులే వానుపటేల్, అశోక్ ఆర్య, ఉప అధ్యక్షులు కీర్మారె శ్యామ్ రావు, బుజడి లచ్చన్న ఎంపిటిసిలు సరిత కిషోర్, చౌదరి నానాజీ, ఓడేట్టి నానయ్య, ఎలుములే శంకర్, మాజీ ఉప సర్పంచ్ తోట మహేష్, బజరంగ్ దళ్ అధ్యక్షులు దుర్గం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇటికలపాడు గ్రామ శివారులో గుర్తుతెలియని మృతదేహం



**ప్రజాపక్షం/సిర్పూర్ టి :** సిర్పూర్ టి మండల కేంద్రంలోని ఇటికలపాడు గ్రామ శివారు పంట చేనులో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. ఇటికలపాడు గ్రామ నివాసి అయినా మేకల కాపరి పురుషోత్తం తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రోజున వృత్తి రీత్య మేకలను తీసుకొని అడవిలోకి వెళ్లి వస్తున్న క్రమంలో గ్రామ శివారులోని పత్తి చేనులో గుర్తు తెలియని మృతదేహాన్ని చూసి గ్రామస్తులకు, పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి మేకల కాపరి ఇచ్చిన సమచారం ప్రకారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.

## చిరు వ్యాపారులకు ఉచితంగా గొడుగులు పంపిణీ



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** కాగజ్‌నగర్ పట్టణం లోని సర్ సిల్క్ మార్కెట్, అంబేద్కర్ చౌరస్తాలో స్పర్శ ఫౌండేషన్, సిర్పూర్ పేపర్ మిల్లు ఆధ్వర్యంలో ఉచిత గొడుగులు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మిల్లు వైస్ ప్రెసిడెంట్ మిశ్రా, జనరల్ మేనేజర్ ఎంఎస్. గిరి మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం వలన చిన్న చిన్న వ్యాపారులు ఇబ్బంది పడవద్దని పేపర్ మిల్లు యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. వ్యాపారులు ప్రతిరోజూ గొడుగులను ఉపయోగించుకుని వేడి తీవ్రత నుండి ఉపశమనం పొందాలని కోరారు.

## సైబర్ వారియర్స్‌కు ఫోన్లు, సిమ్ కార్డులను అందజేసిన జిల్లా ఎస్‌పి




**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ ప్రతినిధి :** జిల్లా ఎస్‌పి కార్యాలయంలో ఎస్‌పి సురేష్ కుమార్ సైబర్ నేరాల కట్టడికి జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో సైబర్ నేరాల పట్ల ప్రత్యేక శిక్షణను పొంది సైబర్ వారియర్స్‌గా నియమింపబడిన సిబ్బందికి ఫోన్లు, సిమ్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్‌కు ఒక్కో సైబర్ వారియర్ చొప్పున 17 మందిని నియమించడం జరిగిందని తెలియజేశారు.సైబర్ వారియర్స్‌గా శిక్షణ పొంది పోలీస్ స్టేషన్లో పనిచేసే సిబ్బందికి ప్రత్యేకంగా ఒక ఫోన్ నెంబర్ ఉంటుందని తెలియజేసారు.సైబర్ నేరాల బారిన పడిన ప్రజలు వెంటనే 1930 కి కాల్ చేయడం గానీ, ఎన్‌సిఆర్‌పి పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయడం గానీ చేయాలన్నారు. బాధితులు ఫిర్యాదులను నమోదు చేసుకుంటేనే గుర్తించడం సులువవుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. సైబర్ నేరాలకు గురైన బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకే సైబర్ వారియర్స్ ను పోలీస్ శాఖ తరపున ప్రతి పోలీస్ స్టేషన్లో నియమించడం జరిగిందని తెలిపారు.సైబర్ నేరాల బారిన పడిన ఫిర్యాదు చేసిన బాధితుడికి సంబంధిత పోలీస్ స్టేషన్లో నియమింపబడిన సైబర్ వారియర్ ద్వారా తమ అప్లికేషన్ స్టేటస్ ను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చని, జిల్లా ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి ప్రభాకర్ రావు, జిల్లా సైబర్ క్రైమ్స్ డిఎస్‌పి రమేష్, ఎస్‌బి సిఐ రాణా ప్రతాప్, సైబర్ సెల్ సభ్యుడు శ్రీనివాస్, సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు



**ప్రజాపక్షం/ఇచ్చోడ :** వేసవి కాలంలో తాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలనీ మండల ప్రత్యేక అధికారి పుల్లయ్య స్థానిక అధికా రులకు ఆదేశించారు. మండలంలోని దాబా (కే) గ్రామ పంచా యతీ పరిధి లోని బాదిగూడ గ్రామంలో స్థానిక అధికారులలో కలిసి ఆయన సందర్శించారు. గ్రామంలోని చేతి పంపులు, మిషన్ భగీరథ ట్యాంక్ ను పరిశీలించారు. అనంతరం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో తాగు నీటి ఎద్దడిపై యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తాగు నీటి సమస్య ఉన్నదని ఎవరు ఫోన్ చేసినా వెంటనే స్పందించి పరిష్కరిం చాలనీ పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఏఈలు తాగు నీటి ఎద్దడి లేకుండా సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు తాగు నీటి వృథాపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో మిషన్ భగీరథ పైప్ లైన్లు, చేతి పంపుల మరమ్మతులు చేపట్టాలనీ సూచించారు. ప్రభుత్వ ఆదే శాలకు అనుగుణంగా అధికార యంత్రాంగం సమన్వ యంతో పని చేయాలనీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో లక్ష్మ ణ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ జైపాల్, ఈజీఎస్ ఏపీవో నరరేందర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల పని వేళలను మార్చాలి



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల పని వేళలను మండుతున్న ఎండల కారణంగా తక్షణమే మార్చాలని (ఎస్‌సిసిడబ్ల్యూఐఎఫ్‌టియు) సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి. బ్రహ్మానందం అన్నారు. బుధవారం శ్రీరాంపూర్ ప్రాంతంలోని ఐఎఫ్‌టియు కార్యాలయంలో కాంట్రాక్ట్ కార్మికుల తో ఏర్పాటు చేసిన డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవికాలం కారణంగా ఏప్రిల్ 5వ తేదీ నుండి సింగరేణి అన్ని రంగాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల పని వేళలను మార్చాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మార్చి నెలలో వేసవి ఉదృతంగా ఉన్నదని, 40 డిగ్రీల ఉష్ణోగ్రత దాటడం వలన కాంట్రాక్టు కార్మికులు పనుల వద్ద వేసవి తాపానికి తాళలేక ఇబ్బందులకు గురై అనారోగ్యాల పాలవుతున్నారని అన్నారు. ఎండల కారణంగా కార్మికులు విధులకు హాజరు కాలేక ఇబ్బందుల పాలవుతున్నారని అన్నారు. ఈ విషయము సింగరేణి వ్యాప్తంగా ఇప్పటికే అన్ని విభాగాల అధికారులకు జి.ఎం.లకు (ఎస్‌సిసిడబ్ల్యూఐఎఫ్‌టియు) ఆధ్వర్యంలో వినతి పత్రాలు అందజేశామని పేర్కొన్నారు. ఈ వేసవి సందర్భంగా ఉచితంగా కార్మికులకు మజ్జిగ, ఒఆర్ఎస్ ప్యాకెట్స్, మంచి నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే పనులు నిర్వహించే విధంగా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని అన్ని ఏరియాలో జి.ఎం.లను ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో బి. అప్పారావు, రాంబాబు, సుధాకర్, శంకర్, రాము, ఎల్లయ్య, సమ్మయ్య, రాజేష్, సత్యక్క, కవిత, శిరీష, స్వప్న, మల్లేశ్వరి పాల్గొన్నారు.

## వన్య ప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు



**ప్రజాపక్షం/వాంకిడి :** వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు డిఎఫ్ఒ నీరజ్ కుమార్ టిబ్రేవాల్ అన్నారు. బుధవారం మండలంలోని సర్కేపల్లి అడవుల్లో వన్య ప్రాణుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన సాసర్ పీట్లను ఆసిఫాబాద్ ఎఫ్ఆర్ఒ(రేంజర్) అప్పలకొండతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో వన్య ప్రాణులకు నీటి ఎద్దడి తలెత్తకుండా సాసర్ పీట్ల నిర్వాహణ చేపడుతున్నట్లు తెలిపారు. అటవీ శాఖ సిబ్బందితో నిత్యం పరిశీలిస్తూ అడవుల సంరక్షణలో భాగంగా ఫైర్ లైన్ ఏర్పాటు చేస్తున్నామని, రాలిన ఆకులను కుప్పలుగా చేసి అధికారుల పర్యవేక్షణలో నిప్పంటించడం జరుగుతుందన్నారు. పశువుల కాపర్లు, అటవీ తీర ప్రాంతాల ప్రజలు బీడీలు కాల్చి అడవుల్లో పడేయకూడదని అన్నారు. ప్రతీ ఒక్కరు అటవీ సంరక్షణను బాధ్యతగా తీసుకుని సహకరించాలని, అడవుల్లో నిప్పంటుకుంటే సమాచారం అందించాలని కోరారు. ఆయన వెంట ఎఫ్ఎస్ఒ లక్ష్మ ణ్, బీట్ అధికారులు ఉన్నారు.

## హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

### రూ. 2 వేల జరిమానా

**ప్రజాపక్ష/ఆసిఫాబాద్ ప్రతినిధి :** భార్యని హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవి రమేష్ తీర్పు ఇచ్చారు. కాగజ్ నగర్ కోర్టు సబ్ డివిజన్ లైజనింగ్ ఆఫీసర్ బాబాజీ తెలిపిన వివరాల ప్రకారం 2023 సంవత్సరంలో పెంచికల్‌పేట్ మండలం, మురళిగూడ గ్రామానికి చెందిన కామెర శ్రీనివాస్ (43) తన భార్య కామెర లక్ష్మి (43) ని హత్య చేసిన నేరంపై కేసు నమోదు కాగా, పిపి జగన్ మోహన్ రావు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా, అప్పటి ఐ.ఒలు ఎం. విజయ్, ఎస్ఐ, కె. నాగరాజు, సిఐ విచారణ జరపడంతో హత్య నేరం రుజువు అయ్యింది. దీంతో నేరస్తుడు కామెర శ్రీనివాస్‌కు సెక్షన్ 302 ఐపిసి ప్రకారం, జీవిత కాలం జైలు శిక్షతో పాటు 2,000 రూపాయల జరిమానా విధిస్తూ కామెర శ్రీనివాస్ కు చెందిన ఆస్తిని పిల్లల పేరు మీద జమ చేయవలసిందిగా సంబంధిత తాసిల్దార్‌కి ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది. వ్యక్తి కాంపెన్సేషన్ స్కీం కింద జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ద్వారా పిల్లలకు తగు న్యాయం జరిగేలా న్యాయమూర్తి తీర్పునిచ్చారు. కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషిచేసిన ప్రస్తుత కాగజ్ నగర్ రూరల్ సిఐ రాంబాబు, ప్రస్తుత పెంచికల్‌పేట్ ఎస్ఐ కొమురయ్య, కోర్ట్ సిబ్బందిని జిల్లా ఎస్‌పి కె. సురేష్ అభినందించారు.

## కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందించాలి



**ప్రజా పక్షం/ఆసిఫాబాద్ :** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా 2023 24 సంవత్సరంలో వివాహం చేసుకున్న లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేయాలని డివైఎఫ్ఐ కెవిపిఎస్ నాయకులు దినకర్ కార్తీక్‌లు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో డివైఎఫ్ఐ కెవిపిఎస్ ఆధ్వర్యంలో కళ్యాణ లక్ష్మి చెక్కులను అందజేయాలని కోరుతూ జిల్లా డిఆర్ఓ లోకేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పథకమైన కళ్యాణ లక్ష్మి కి దరఖాస్తు చేసుకున్నా నేటికి కళ్యాణ లక్ష్మి డబ్బులు రాలేదని దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఆర్ఓ, ఆర్‌డిఓ, ఎంఎల్ఏ, ట్రెజరీ వద్ద కళ్యాణ లక్ష్మి ఆన్లైన్ పూర్తి అయినా ప్రభుత్వం బ్యాంకులలో డిపాజిట్ చేసినా ఇప్పటివరకు చెక్కు రూపంలో లబ్ధిదారులకు అందలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న చెక్కులను త్వరగా అందజేయాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతి వేడుకలు



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** చత్రపతి శివాజీ మహారాజ్ 344 వ వర్ధంతి ని ఆరే సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఛత్రపతి శివాజి మహారాజ్ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆరే సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బోటుపెల్లి జైరాం శివాజీ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డివిజన్ గౌరవ అధ్యక్షుడు చౌదరి గోపాల్, అధ్యక్షుడు బొర్కుటే తిరుపతి, కార్యదర్శి బోటుపెల్లి ప్రశాంత్, బిసి సంఘం రైతు అధ్యక్షులు వైరగాడే మారుతి, ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు గేడేకార్ సంతోష్ శంకర్, ఉపాధ్యక్షుడు పిప్రే సాయి, ప్రధాన కార్యదర్శి నాగపూర్ మనోహర్, సంఘ నాయకులు లోఖండే నాగన్న, నగపూరి మహేష్, శేఖర్, అంబాదాస్ తదితరులు పాల్గొన్నారు.

## మరోసారి మంచి మనసును చాటుకున్న కృష్ణంరాజు

**ప్రజాపక్షం/కడెం :** మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మి బక్కన్న గౌడ్ ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నాయి అని తెలుసుకొని వారి ఏకైక కుమార్తె వివాహానికి పసుపు, కుంకుమ, మంగళసూత్రం, వారి కుటుంబానికి కృష్ణంరాజు ఓకెఆర్ ఫౌండేషన్ ద్వారా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వారి మిత్రులు పాల్గొన్నారు.

## చైన్ స్నాచింగ్ ముఠా అరెస్ట్..



**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాలజిల్లా ధర్మపురి మండలంలోని రాయపట్నం శివారు పెట్రోలు బంకువద్ద గతనెల 29 తేదిన చైన్ స్నాచింగ్ కేసులో నలుగురిని భుదవారం పోలీసులు అరెస్టు చేశారు.ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలయం ఆవరణలో భుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేవంలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ మాట్లాడారు.కొందరు జల్సాలకు అలవాటుగా చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్నట్లు గా గుర్తించమన్నారు.సీసీ పుటేజి ద్వార గుర్తించి 4 గురిని అరెస్టు చేశామని అన్నారు.ముఠా దొంగతనాలు చేస్తు ఉంటారని కోరుట్లకు చెందిన సిలిగిరి సందీప్,ముంజ రాజేందర్ అదేరోజున పల్సర్ బైక్‌పై వచ్చి దోసకాయలు అమ్ముతున్న మహిళను టార్గెట్ చేసి మరొకరు అమెవద్దకు వెళ్లి అమె మెడలనుండి 22 గ్రాముల పుస్తెలతాడు,ఒక గ్రాము పుస్తె తెంపుకుని పరారయ్యారు.వారు మళ్ళీ భీంగల్‌కు గ్రామానికి వెళ్ళి బంగారం అమ్మేందుకు మెట్‌పల్లికి చెందిన పోతు అక్షయ్‌కుమార్ అతని భార్య అలెఖ్య సమాయంతో మంచిర్యాలకు వెళ్ళేందుకు ప్రయత్నించగా 22 గ్రాముల పుస్తెలతాడు,గ్రాము పుస్తె,3 సెల్‌ఫోన్లు,రెండు ద్విచక్రవాహనాలు పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లుగా డీఎస్పీ రఘుచందర్ తెలిపారు.దొంగలను పట్టుకున్న ధర్మపురి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎలపాటి రాంనర్సింహారెడ్డి,పులిచర్ల ఉదయ్‌కుమార్ ఉమాసాగర్(వెల్గటూర్)సతీష్(గొల్లపల్లి) శ్రీధర్‌రెడ్డి,(బుగ్గారం) లను జిల్లా ఎస్పీ సంప్రీత్ సింగ్, డీఎస్పీ రఘుచందర్‌లు అభినందించారు. వీరికి త్వరలో రివార్డులు అందిస్తామన్నారు. ఏఎస్ఐ రాజు,హెడ్‌కానిస్టేబుళ్ళు ఎం శంకర్, అశోక్, రామస్వామి, లింగారెడ్డి కానిస్టెబుళ్ళు ఉన్నారు

## విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలి



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** జిల్లా కేంద్రంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎండలు,తీవ్రమవుతున్న తరుణంలో,వేసవి తపాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం కళాశాల,పాఠశాలాల కు వెళ్తున్న విద్యార్థులకు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలనీ ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు నవీన్ కోరారు.

## బహుజనుల రాజ్యాధికారం కోసమే మా పోరాటం



**ప్రజాపక్షం/మంథని :** బహుజనుల రాజ్యాధికారం కోసమే తమ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. తెలంగాణ రైతంగా సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా మంథని పట్టణంలోని దొడ్డి కొమురయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆనాడు భూస్వామ్య పెత్తందారి వ్యవస్థకు వ్యతిరేకంగా దొడ్డి కొమురయ్య పోరాటం చేశారని గుర్తు చేశారు. బడుగు బలహీనవర్గాల కోసం పోరాటం చేసిన చాకలి ఐలమ్మ, జ్యోతిరావుపూలే, బీఆర్ అంబేద్కర్, దొడ్డి కొమురయ్యల పోరాట స్పూర్తితోనే మనం తెలంగాణ సాధించుకున్నామని ఆయన తెలిపారు. అయితే మహనీయులు చరిత్ర, వారి స్పూర్తిని తెలుసుకోకపోవడం మూలంగానే ఈనాడు మనం ఇంకా బానిసలుగా బతుకుతున్నామని అన్నారు. మంథనిలాంటి మారుమూల ప్రాంతాల్లో మండల స్థాయి నాయకులు మహనీయుల చరిత్రను అర్థం చేసుకోకపోవడం బాధాకరమన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బీసీలు, ఎస్సీలకు రాజ్యాధికారం రాదనేది గత ఎన్నికలతోనే నిరూపణ అయిందని ఆయన గుర్తు చేశారు. రిజర్వేషన్‌లను అనుభవిస్తున్న నాయకులు మహనీయులు స్పూర్తిని అర్థం చేసుకోకపోవడం మూలంగా మూడు ఓట్లు కూడా లేనోళ్లు యాభై ఏండ్లుగా మనల్ని పరిపాలిస్తున్నారని అన్నారు. ఏప్రిల్ మాసమంతా మహనీయుల మాసమని, మహనీయుల స్పూర్తితో నియోజకవర్గంలో బలహీనవర్గాలకు రాజ్యాధికారం వచ్చే వరకు పోరాటం చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, నాయకులు తగరం శంకర్ లాల్, కనవేన శ్రీనివాస్ యాదవ్, పెగడ శ్రీనివాస్, సుల్తాన్ ఆసిఫ్‌ఖాన్, ఇర్ఫాన్‌తో పాటు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలి




**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య తెలిపారు.ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు బుధవారం పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో నిర్వహించిన ఓటరు అవగాహన 5కే రన్ లో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి. గంగయ్య ఏ.సి.పి. క్రిష్ణ, సి.ఐ. క్రిష్ణ లతో కలిసి పాల్గొని జెండా ఊపి 5కె రన్ ను ప్రారంభించారు.పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి అమర్ నగర్, మసీద్ చౌరస్తా, జండా చౌరస్తా, సుభాష్ విగ్రహం, కమాన్ మీదుగా తిరిగి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు 5కే రన్ నునిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే లోక్ సభ ఎన్నికల దృష్ట్యా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని, నమోదైన ప్రతి ఒక్క ఓటరు తమ ఓటును తప్పనిసరిగా వినియోగించు కోవాలని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో తమ పేరును సరిచూసు కోవాలని, జాబితాలో తమ పేరు లేని పక్షంలో వెంటనే నూతన ఓటరుగా నమోదు చేసుకునేందుకు దరఖాస్తు సమర్పించాలని, పెద్దపల్లి పార్లమెంట్ స్థానానికి మే 13న జరిగే పోలింగ్ లో ప్రతి ఒక్క ఓటరు పాల్గొని, ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వెంకటేష్,తహాశీల్దార్ రాజ్ కుమార్, మునిసిపల్, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు ఆశీర్వాదం



**ప్రజాపక్షం/ముత్తారం :** ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామానికి చెందిన దాసరి పద్మ దామోదర్ గౌడ్ కుమారుడు ప్రశాంత్ గౌడ్, గాయత్రి వివాహం బుధవారం ముత్తారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్ లో జరిపించగా ముఖ్య అతిథులుగా పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు, మాజీ సింగిల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కిషన్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షులు నూనె కుమార్, ఓడేడు గ్రామ శాఖ అధ్యక్షులు నరేడ్ల రమేష్, బొమ్మిడి మల్లేష్ తోపాటు తదితరులు పాల్గొని వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ఆశీర్వాదం... మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన గట్టు లక్ష్మి సదయ్య కూతురు గాయత్రి వివాహ వేడుకలు బుధవారం జరిపించగా ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు దొడ్డ బాలాజీ, కోల విజయ్ గౌడ్, ఆకోజు అశోక్ చారి తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే బిజెపి పార్టీ నాయకులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి నూతన వధూవరులను ముఖ్య అతిథిగా పాల్గొని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట బిరుదు గట్టయ్య, హరీష్ తదితరులున్నారు.

## పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలి



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్, శ్రీ గ్రీన్ వర్క్ ప్రైవేట్ లిమిటేడ్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వాడకాలపై జరిగే అనర్థాలపై జిల్లా కేంద్రంలోని పురపాలక సంఘం కార్యాలయంలో ఢిల్లి నుండి విచ్చేసిన విద్యార్థులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్ తో పర్యావరణానికి పెనుముప్పు వాటితో ప్రమాదం ఉందని ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని కోరారు.పట్టణంలోని కమర్షియల్ షాపింగ్ మాల్స్, వ్యాపారస్తులకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, దారంతో నేసినవి,సంచి వంటిని ఉపయోగించాలని కోరారు. గత ఐయిదు రోజులుగా జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళిల్లో ప్లాస్టిక్ వాడకాల పై జరిగే అనర్థాల గూర్చి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. కమిషనర్ సి.వి.ఎస్ రాజు,టి.పి.ఎస్ నవీన్,టి.పి.ఓ సుమలత,సాజిటరీ ఇన్స్పెక్టర్ దేవిదాస్,కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

## పాఠశాల చైర్మన్‌కు ఘన సన్మానం

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ ప్రభుత్వ పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ పాంచాల చక్రపాణి ని గ్రామస్తులు, అధ్యాపక బృందం ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ.. అడవి శ్రీరాంపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ గా 2018 నుండి 2024 కొనసాగి పాఠశాల అభివృద్ధి కోసం విశేష సేవలందించిన పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ అయినా పాంచాల చక్రపాణి బుధవారం పాఠశాల పదవి కాలం ముగియడంతో ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకలు. గ్రామస్తులు తదితరులు శాలువాలతో సన్మానించారు.

## లక్ష్మణ్‌కు నంది అవార్డు



**ప్రజాపక్షం/యైటింక్లయిన్ కాలనీ :** స్థానిక శ్రీవాణి పాఠశాల కరస్పాండెంట్ గూళ్ల లక్ష్మణ్ కుమ్మార్ శిఖర ఆర్ట్స్ హైదరాబాద్ వారిచే నంది పురస్కారం 2024 అవార్డు అందుకున్నారు. ఇటీవల హైదరాబాదులోని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు గత నాలుగు దశాబ్దాలుగా విద్యారంగంలో సేవలందిస్తున్న లక్ష్మణ్ కుమార్ ను వేదిక పైకి ఆహ్వానించి అభినందించి, 2024 సంవత్సర అవార్డుతో సత్కరించారు. ఇదిలా ఉండగా బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పలువురు స్థానికులు లక్ష్మణ్ కుమార్ కు శాలువాలతో సన్మానించి ప్రశంసించారు.

## బిజెపి,బిఆర్ఎస్ పార్టీలకు తెలంగాణలో చోటులేదు

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** బిజెపి,బిఆర్ఎస్ పార్టీలకు తెలంగాణలో చోటు లేదని డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు అన్నారు. గంజల్ గ్రామ ఉపసర్పంచ్ ముత్తన్న ఆధ్వర్యంలో సోన్ మండల ప్రజా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు ఫక్రుద్దీన్ నేతృత్వంలో పెద్ద ఎత్తున బీజేపీ పార్టీకి రాజీనామా చేశారు.బుధవారం జిల్లా కేంద్రంలోని కేఎస్ఆర్ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు వారికి శ్రీహరిరావు పార్టీ కండువాలు కప్పి హస్తం పార్టీలోకి స్వాగతించారు.రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీ,బీఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చెరుతున్నారని తెలిపారు.సీఎం రేవంత రెడ్డి నేతంలో 6 గ్యారంటీ పథకాలు అమలు చేయడంతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించి దేశంలో రాహూల్ గాంధీని ప్రధానమంత్రిని చేద్దామని పిలుపునిచ్చారు.

## తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ మున్సిపాలిటీలోని డబుల్ బెడ్ రూమ్ కాలనీలో,గత కొంతకాలంగా త్రాగునీటి ఎద్దడి ఉన్న నేపథ్యంలో, స్థానికులు మున్సిపాలిటీకి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మున్సిపల్ చైర్మన్ రాజుర సత్యం స్పందించి.తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేపించారు.ఇటీవలే మండలంలోని ఇక్బాల్‌పూర్ గ్రామంలో నుండి,వచ్చే మిషన్ భగీరథ పైప్ లైన్‌ల ద్వారా,డబుల్ బెడ్ రూమ్ కాలనీకి నీటి సరఫరా ఉద్ధరించినట్లు చైర్మన్ తెలిపారు.ఈ మేరకు బుధవారం ఆ కాలనీలోని పంపులను, త్రాగునీటితో నింపి అక్కడ స్థానికులకు త్రాగు నీటిని అందించారు.ఈ కార్యక్రమంలో,కౌన్సిలర్లు కిషోర్ నాయక్,కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ భాష,నాయకులు పరిమి సురేష్,జన్నారపు శంకర్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** వచ్చే నెలలో జరిగే పార్లమెంటు ఎన్నికల గురించి ఎన్నికల సిబ్బందికి నిర్వహించే శిక్షణ కార్యక్రమంలో ఆర్డిఓ రత్నకళ్యాణ సందర్శించి ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎలక్షన్ల నిర్వహణలో పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, శిక్షణ సమయంలో ఈవీఎంల పనితీరు ముఖ్యమైన ఫమ్స్ నింపడం, మెటీరియల్ చెక్ చేసుకోవడము, మాక్ పోల్ నిర్వహణ, ఇసిఐ గైడెన్స్ ప్రకారం నుడుకోవాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎం. ఆర్.ఓలు రాజు, జానకి, శ్రీదేవి, మాస్టర్ ట్రైనర్ బచ్చు శ్రీనివాస్,శ్రీనివాస్ రెడ్డి, మైస అరవింద్, నారాయణ వర్మ, ఉమామహేశ్వర్ రెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం విక్రయించాలి

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** రైతులు అరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యం ను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో నే విక్రయించుకొని మద్దతు ధర పొందాలని పెద్దపల్లి జిల్లా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్టర్ కే ,అశోక్ కుమార్ అన్నారు. బుధవారం సుల్తానాబాద్ మండలం చిన్నకల్వల సింగిల్ విండో పరిధిలోని రెబల్దేవ్ పల్లి, చిన్నబొంకూర్, మియాపూర్, పెరకపల్లి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో సెక్రటరీ రమేష్ , రైతులు, హమాలీలు, సంఘం సిబ్బంది, పలువురు పాల్గొన్నారు.

## తప్పిపోయిన వృద్ధుడిని ఆశ్రమానికి చేర్చిన కేర్‌సెంటర్..



**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** రాజన్నసిరిసిల్లా జిల్లా ఇల్లంతకుంట మండలంలోని ఓగులపురం గ్రామానికి కేంద్రానికి చెందిన మెడకోకుల నర్సయ్య(81) ఎల్లారెడ్డిపేట మండలంలోని పాతబస్టాండ్ వద్ద తప్పిపోయి తిరుగుతున్నాడు.దీంతో భుధవారం ఆయనను స్థానికులు ఒగ్గుబాలరాజు జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మి రాజంకు సమాచారం అందించారు.వెంటనే అతడిని వృధ్ధాశ్రామనికి చేర్చి తన కుమారుడికి చరవాణి ద్వార వివరాలు తెలుసుకుని ఓబులపురం సర్పంచ్‌కు తెలిపి తన తండ్రిని కుమారుడి వద్దకు చేర్చినారు.వారి వెంట ఎల్లారెడ్డిపేట డేకేర్ సెంటర్ నిర్వాహకురాలు ముచ్చమమత ఉన్నారు.వృధ్ధులకు ఆశ్రయం ఇవ్వడంలో తమవంతు పాత్ర ఖచ్చితంగా ఉంటుందని ఎవరైన నిరాశ్రాయులు ఉంటే తమకు సమాచారం అందివ్వాలని కోరారు.

## ఫిట్ సెక్రటరీని సన్మానించిన యూత్ సభ్యులు

**ప్రజాపక్షం/రామగిరి :** రామగుండం ఆర్ జి త్రీ ఏరియా ఓసిపి 2 నూతన ఫిట్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన రామిండ్ల మనోహర్ ను లద్నాపూర్ ఎస్సీ కాలనీ యూత్ సభ్యులు బుధవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. మనోహర్ ఫిట్ సెక్రటరీగా నియామకం కావడం పట్ల యూత్ సభ్యులు హర్షం వ్యక్తం చేసి సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో అడ్లూరి ప్రవీణ్, రామిల్ల రాజేందర్, అడ్లూరి శ్రీకాంత్ ,అడ్లూరి నవీన్, ఈర్ల పవన్ తదితరులు ఉన్నారు.

## విద్యుత్ లైన్‌ల క్రింద పంట అవశేషాలకు నిప్పు పెట్టవద్దు

**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** 400కేవి విద్యుత్ లైన్ ల క్రింద మంటలు పెడితే పెను ప్రమాదం సంభవిస్తుందని, హై టెన్షన్ విద్యుత్ లైన్ల క్రింద ఉన్న పంట పొలాలలో పంట అవశేషాలకు నిప్పు పెట్టవద్దని పవర్ గ్రిడ్ చీఫ్ మేనేజర్ పవన్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పరిధిలోని 400 కేవి విద్యుత్ లైన్ ల క్రింద పంట అవశేషాలను తగలబెట్టవద్దని, పంట అవశేషాలు కాల్చే సమయంలో మంటలు చెలరేగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని అన్నారు. పెద్దపల్లి జిల్లాలోని రామగుండం, రామగిరి, శ్రీరాంపూర్, సుల్తానాబాద్, పెద్దపల్లి, ఓదెల, పాలకుర్తి, ముత్తారం, మంథని, కమాన్పూర్, ఎలిగేడు మండలాల్లో చాలా గ్రామాలలో 400 కేవీ విద్యుత్ లైన్ల క్రింద పంట సాగు ఎక్కువగా ఉందని తెలిపారు. పంట అవశేషాలను విద్యుత్ లైన్ ల క్రింద తగలబెట్టడం వల్ల విద్యుత్ సరఫరా అంతరాయంతో పాటు జంతువులు, మానవులకు హాని జరిగే అవకాశం ఉందని, రైతులు ఈ విషయాన్ని గమనించి పంట అవశేషాలను విద్యుత్ లైన్ ల క్రింద తగలబెట్టడం మానుకోవాలని పవన్ కుమార్ పేర్కొన్నారు.

# ఆపరేషన్ గరుడ ప్రారంభం

### డ్రోన్‌లతో పట్టణం లో పెట్రోలింగ్



**ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి :** పెద్దపల్లి పోలీస్ స్టేషన్ ఈరోజు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్,పెద్దపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆపరేషన్ గరుడ పేరుతో డ్రోన్ పెట్రోలింగ్ ప్రారంభించారు.ఈసందర్భంగా సీపీ గారు మాట్లాడుతూ అసాంఘీక శక్తుల నిర్మూలనకు, నేరాల నియంత్రణ, ప్రజల భద్రత,లా అండ్ ఆర్డర్ దృష్ట్యా పెద్దపల్లిలో ప్రయోగాత్మకంగా ఆపరేషన్ గరుడ మొదలు పెట్టమని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ తెలియజేశారు. సిపి రామగుండంలో చార్జ్ తీసుకున్న తర్వాత మొదటిసారి పెద్దపల్లి పోలీస్ స్టేషన్ సందర్శనకు వచ్చినప్పుడు సిబ్బంది వివిధ డ్యూటీ లో ఉండి కొన్ని సందర్భలలో ప్రత్యేక నిఘా ఉంచడం ఇబ్బంది ఉంటుంది కనుక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పోలిసింగ్ కి సహాయం పొందేవిధంగా డ్రోన్ ద్వారా ఏరియల్ సర్వే చేయాలనే ఉద్దేశ్యంతో ఆపరేషన్ గరుడ కార్యక్రమం అనుకోవడం జరిగింది. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక పట్టణం ను పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేయడం తక్కువ సమయంలో డ్రోన్ ద్వారా సాధ్యం అవుతుంది. ఎవరైనా గొడవలకు పాల్పడిన, చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడిన వీడియోలు, ఫోటోల ఆధారాలతో వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది అన్నారు. పెద్దపల్లి పట్టణ కేంద్రంతోపాటు శివారు ప్రాంతాల్లో అసాంఘీక కార్యకలాపాలు జరగకుండా ఉండెదుకు ఆపరేషన్ గరుడ పేరిట డ్రోన్‌లతో పెట్రోలింగ్ నిర్వహించి ప్రత్యేక నిఘా ఉంటుందని భవిష్యత్తు లో కమిషనరేట్ వ్యాప్తంగా అమలు చేస్తామన్నారు.ప్రజల భద్రత మరియు నేరాల నియంత్రణ లో భాగంగా పోలీస్ వారికీ తమ వంతు సహాయం గా లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ చెగొండ వెంకటేష్ గారు ఆపరేషన్ గరుడ కోసం ఉపయోగించే డ్రోన్ కోసం ఆర్థికంగా సహాయం చేయడానికి ముందుకు రావడం జరిగింది. వారిని సీపీ ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి. రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, పెద్దపల్లి ఏసిపి కృష్ణ , సీఐ కృష్ణ,ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్ఐ లు లక్ష్మణ్‌రావు, మల్లేష్ తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

# సమాజంలో రౌడీగా కాకుండా మీ పిల్లలకు హీరోలా ఉండండి



### మీ కుటుంబ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మారండి

### నేరప్రవృతిలో మార్పు తెచ్చేందుకు జిల్లాలోని రౌడీ షీటర్స్ కు కౌన్సిలింగ్

### ఎస్పి అఖిల్ మహాజన్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** జిల్లాలో ఉన్న రౌడీ షీటర్స్ యెక్క నెరప్రవృతిలో మార్పు తెచ్చేందుకు బుధవారం రోజున సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ లో రౌడి షీటర్స్ మెళ ఏర్పాటు చేసి వారు చేసిన చివరి నేరం, ప్రస్తుతం వారి జీవన విధానం గురించి అడిగి తెలుసుకొని వారి ప్రవర్తనలో మార్పు రావడానికి ఒక అవకాశం కల్పిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మీ యెక్క ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలని జిల్లా ఎస్పి తెలిపారు. ఈ నేపథ్యంలో ఎస్పి మాట్లాడారు. నేర జీవితం వీడి ప్రస్తుత సమాజంతో మంచి జీవితం గడుపుతూ హుందాగా జీవిస్తూ ఉండాలని, తొందర పాటులో నేరాలు చేసినా సరే తప్పు చేయని మీ కుటుంబం కూడా దాని వల్ల ఎన్నో ఇబ్బందులు పడుతుందని తెలిపారు. రౌడీ షీటర్స్ తన కుటుంబం, పిల్లల భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకొని వారి ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలని, రౌడీ షీటర్ అనే ఓ పదం తమ బిడ్డల భవిష్యత్ కూడా నాశనం చేస్తుందని గుర్తు చేశారు. సమాజంలో ఒక రౌడిగా కాకుండా మీ పిల్లలకు ఓ మంచి తల్లిదండ్రులుగా ఉంటూ హీరోగా మిగిలిపోవలని ఎస్పి తెలిపారు. జిల్లాలో ఉన్న రౌడి షీటర్స్ కి ఒక అవకాశం కల్పిస్తున్నని పార్లమెంట్ ఎన్నికల అనంతరం డిసెంబర్ లోగా మీ మీ ప్రవర్తనలో మార్పు వస్తే మీ మీద ఉన్న రౌడి షీట్స్ తొలగించేందుకు అవకాశం ఉంటుందని,దానికి కోసం ప్రతి ఒక రౌడీ షీటర్ కదలికలు, చర్యల పై పోలీస్ నిఘా ఉంటుందని, నేర ప్రవృతి లో మార్పు రాకపోతే చట్టపరంగా చర్యల తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలోనే కాకుండా భవిష్యత్తులో ఎలాంటి నేరాలకు పాల్పడకుండా మంచి సత్ప్రవర్తంతో ఉండాలని, ఏలాంటి ప్రలోభాలకు గురై నేరాలకు పాల్పడకుండా నేరప్రవృత్తిని మార్చుకోవడానికి ఒక అవకాశం ఇస్తున్నామని, ఒకవేళ మారకపోతే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని హెచ్చరించారు. గత పది సంవత్సరాల నుండి ఎలాంటి నేరాలకు పాల్పడకుండా మంచి సత్ప్రవర్తన కలిగి ఉండి పూర్తిగా మారితే రౌడీ షీట్ తొలగించేందుకు కూడా అవకాశం ఉందని ఎస్ పి అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి చంద్రయ్య, డిఎస్పి లు చంద్రశేఖర్ రెడ్డి, నాగేంద్రాచరి, సిఐలు, ఎస్ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

## వృత్తి శిక్షణ ద్వారా మహిళలకు స్వయం ఉపాధి



**ప్రజాపక్షం/రామగిరి :** సింగరేణి సేవా సమితి ద్వారా నిర్వహించిన పలు ఉచిత వృత్తి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొని, మహిళలు స్వయం ఉపాధి పొందాలని ఆర్జీ3 సేవా అధ్యక్షురాలు ఎన్. అలివేణి సుధాకర రావు అన్నారు.బుధవారం స్థానిక సెంటినరీకాలనీలోని సేవా భవనము నందు టైలరింగ్, మగ్గం వర్క్స్, ఫ్యాషన్ డిజైనింగ్, జ్యూట్ బ్యాగ్ తయారీ, బ్యూటిషియన్ మొదలగు విభాగాలలో సెంటినరీ కాలనీలోని సేవాభవన్, రత్నాపూర్, జూలపల్లి, లద్నాపూర్, కల్వచర్ల, లొంకకేసారం నందు నిర్వహించిన వివిధ ఉచిత వృత్తి శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి సేవా అధ్యక్షురాలు ఎన్.అలివేణి సుధాకర రావు ముఖ్య అతిథిగా హాజరై, వారు మాట్లాడుతూ 202324 సంవత్సరంలో వివిధ విభాగాలలో మొత్తం 11 బ్యాచ్ ల నిరుద్యోగ మహిళలకు ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణను ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ శిక్షణను మహిళలందరూసద్వినియోగం చేసుకొని, స్వయం ఉపాధి పొందుతూ, ఆర్థికంగా బలపడాలన్నారు. సింగరేణి సంస్థ ఉద్యోగుల కుటుంబాల మహిళలతో పాటు పరిసర గ్రామాల నిరుద్యోగ మహిళల కోసం ఇలాంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా 202223 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సేవా సమితి ద్వారా నిర్వహించిన వివిధ నైపుణ్యాభివృద్ధి కోర్సులలో శిక్షణ పొంది సంబంధిత పరీక్షలో ఉత్తీర్ణులైన మహిళలకు ధృవపత్రాలను అందచేశారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలు, శిక్షకురాల్లు వారిఅభిప్రాయాలను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి, కోఆర్డినేటింగ్ అధికారి గుర్రం శ్రీహరి, డి.వై.పి.ఎం సునీల్, సేవా సంయుక్త కార్యదర్శి ఉమా దేవి, సేవా సమితి సమన్వయ కర్త బి.రాయమల్లు, కే.సుధాకర్ లతోపాటు మహిళలు పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి లేకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/ రామగిరి :** వేసవికాలం దృశ్య గ్రామాల్లో త్రాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పెద్దపెల్లి డిపిఓ లత అన్నారు బుధవారం రామగిరి మండలంలోని పన్నూరు గ్రామపంచాయతీలో రామగిరి, ముత్తారం మండలాల కార్యదర్శులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు శానిటేషన్ నిర్వహించాలని వాటర్ ట్యాంక్ లో క్లోరినేషన్ చేయించాలని అన్నారు. ఇంటి పన్ను,ట్రేడ్ లైసెన్స్ సీసీ చార్జెస్, లైబ్రరీ సెస్ చెక్స్ తోపాటు ఇసుక క్వారీల టాక్స్, గ్రామపంచాయతీ రికార్డ్స్ అప్డేట్స్, తో పాటు వేడి గాలుల దృశ్య తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇతర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అన్నారు. ఈ సమావేశంలో డిఎల్పిఒ శంకర్, ఎంపిఒలు, గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

## అక్రమంగా మట్టి తరలిస్తున్న జెసిబి, టిప్పర్ సీజ్



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ మండలం రామునిపల్లి గ్రామంలో ఏలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న జెసిబి, టిప్పరును సీజ్ చేయడం జరిగిందని తాసిల్దార్ మధుసూదన్ రెడ్డి తెలిపారు.

## అల్లిపూర్ పోచమ్మ బోనాల్లో పాల్గొన్న నల్ల మనోహర్‌రెడ్డి

**ప్రజాపక్షం /సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ మండలం అల్లీపూర్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పోచమ్మ బోనాల్లో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నల్ల మనోహర్ రెడ్డి బోనం ఎత్తుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. నల్ల మనోహర్ రెడ్డి వెంట గౌడ సంఘం నాయకులు గట్టు శ్రీనివాస్ గౌడ్ తో పాటు పలువురు ఉన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన పూసల సంఘం నాయకులు

**ప్రజాపక్షం/మంథని :** తెలంగాణ సంచార జాతుల సంఘం పూసల సంఘం నాయకులు కాంగ్రెస్‌పార్టీలో చేరారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో తెలంగాణ రాష్ట్ర సంచార జాతుల సంఘం నాయకులు జిల్లా బీసీ ఫెడరేషన్ కులాల సమితి జిల్లా పార్లమెంట్ ఇంచార్జీ గుడ్ల సమ్మయ్య, సంఘం నాయకులు ఒంటెద్దు నరేందర్, చీపురుశుట్టి శ్రీనివాస్, గట్ల కృష్ణ సదానందంలు కాంగ్రెస్ పార్టీలో చేరగా మంత్రి శ్రీధర్‌బాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో సంచార జాతులు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలుస్తాయని ఈ సందర్భంగా వారు ప్రకటించారు.

## తాగునీరు సమస్యలు ఉంటే సమాచారం ఇవ్వాలి

### టోల్ ఫ్రీ నంబర్ 9398684240

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** జిల్లాలోని ఆయా సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలు, అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఎక్కడైనా తాగునీరు సమస్యలు ఉంటే సమాచారం ఇవ్వాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో తాగునీరు సమస్యలపై వచ్చే ఫిర్యాదులు స్వీకరించేందుకు కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని వెల్లడించారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమి ఆధ్వర్యంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య ఇంచార్జీగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. కంట్రోల్ రూం 24* 7 పనిచేస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. తాగునీరు సమస్య ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ కు 9398684240 కాల్ చేయాలని సూచించారు. వారు సంబంధిత అధికారులకు తెలిపి సమస్య పరిష్కరిస్తారని తెలిపారు.